క్లుప్తంగా

న్యాయవాదికి అభినందనలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన సీనియర్ అడ్వకేట్ కె.నరసింహారావుకు మైసొసైటీ ఎన్‌జీఓ సంస్థ సభ్యులు శనివారం అభినందనలు తెలిపారు. హనుమకొండలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలాకర్‌రావు, సంస్థ నాయకులు రాజన్‌బాబు, గోపిచంద్ నాయక్, ప్రముఖ రచయిత, దర్శకులు టీవీ అశోక్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీ కోసం మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణరాజు తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 15వ తేదీ లోపు హసన్‌పర్తి మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గణపతి దీక్షల తేదీలు ఖరారు

కాజీపేట: గణపతి దీక్షల తేదీలను కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో పాలక మండలి సభ్యులు శనివారం ఖరారు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి గణపతి నవరాత్రులతో పాటు దీక్షల తేదీలను నిర్ణయించారు. గణపతి దీక్షలు మండల (42) రోజులు, 21, 16, 11 రోజుల దీక్షలను స్త్రీ, పురుషులతో పాటు అన్ని వయస్సుల వారు స్వీకరించవచ్చని తీర్మానించారు. ఆగస్టు 6న మండల దీక్షలు, ఆగస్టు 26న అర్ధ మండల దీక్షలు, ఆగస్టు 31న షోడష దీక్షలు, సెప్టెంబర్ 6న ఏకాదశ దీక్షలు తీసుకోవచ్చని భక్తులకు సూచించారు. సెప్టెంబర్ 17న భక్తులకు ఇరుముడి ధారణ, దీక్షల విరమణ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, ఆలయ మేనేజర్ రవి, దేవులపల్లి సదానందం, చౌక్కారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును అభివృద్ధి చేయాలి

ఖిలా వరంగల్: మధ్యకోట ఖుష్‌మహల్ నుంచి ఏకశిల చిల్డ్రన్స్ పార్కు వరకు గుంతలు పడిన రోడ్డును అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు నాయకులు గజ్జెల శ్యామ్, సాగర్ల శ్రీనివాస్, కార్పొరేటర్ బైరబోయిన ఉమతో కలిసి అధికారులు మధ్యకోటలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గుంతలమయమైన రోడ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

కాజీపేట: నానాటికి పెరుగుతున్న సాంకేతిక కారణాల వల్ల ఉపాధి కోల్పోతున్న ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సంఘం పట్టణ అధ్యక్షుడు తూర్పాటి జగదీశ్వర్ గుర్తుచేశారు. కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ డిజిటల్, త్రీడీ రంగ ప్రవేశంతో మ్యానువల్ కార్మికులు రోడ్డునపడే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటో, వీడియోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలని కోరారు.

రేపటినుంచి శిక్షణ తరగతులు



కాజీపేట: కాజీపేట ప్రధాన రహదారిపై కుల వివక్ష పోరాట సమితి సభ్యులు కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు విద్యుత్ భవనంలో జరగనున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, మొగిళి, సుగుణ, జ్యోతి, రాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేపపిల్లల్ని ఇవ్వాలి



న్యూశాయంపేట: ఉచిత చేపపిల్లల పథకాన్ని కొనసాగించాలని తెలంగాణ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ కోరారు. మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేతను కలిసిన కుడా చైర్మన్

నయీంనగర్: కాంగ్రెస్ నేత ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావును ఆయన స్వగృహంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డిని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది రావు అమరేందర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలగా సెంట్రల్ లైటింగ్

- హామీలే తప్ప ఆచరణ శూన్యం
- అంధకారంలో జాతీయ రహదారి
- నిత్యం రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



సెంట్రల్ లైటింగ్ లేని హసన్‌పర్తి చౌరస్తా

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు కలగా మారింది. ప్రజాప్రతినిధులు తమ హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. లైటింగ్ సిస్టమ్ లేక జాతీయ రహదారి అంధకారంలో మునిగిపోతోంది. దాంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాతీయ రహదారి మార్గమధ్యలో..

హనుమకొండ – కరీంనగర్ జాతీయ రహదారి మార్గమధ్యలో హసన్‌పర్తి ఉంది. భీమారం నుంచి హసన్‌పర్తి రెవెన్యూ కార్యాలయం వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎల్లాపూర్ వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, వేములవాడకు ఈ మార్గం నుంచే వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.

అమలు కాని హామీలు

వాహనాల తాకిడి ఎక్కువ కావడంతో రాత్రివేళ నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నికలొచ్చినప్పుడు అభ్యర్థులు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటే తమ తొలి ఎజెండాగా హామీ ఇస్తూ, ఆ తర్వాత ఆ హామీని విస్మరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అలుముకుంటున్న అంధకారం

చీకటి కారణంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. హసన్‌పర్తి పెద్ద చెరువు మూలమలుపు, సీతంపేట క్రాస్, నల్లగట్టు గుట్ట, చిన్నంగి చెరువుకు వెళ్లే దారి, ఎల్లాపురం వద్ద రాత్రి వేళల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు నిధులు మంజూరు చేయాలి. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి నిధుల మంజూరుకు కృషి చేయాలి.

– మారపల్లి రాంచంద్రారెడ్డి, రైతు

నిత్యం రోడ్డు ప్రమాదాలు



జాతీయ రహదారిపై వీధి దీపాలు లేకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నికల హామీలను ప్రజాప్రతినిధులు అమలు చేయాలి. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– పిట్టల కుమారస్వామి, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు

26న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

మడికొండ: పేదల ఇళ్ల కోసం ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో పార్టీ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు స్థలం ఉన్నవారికి పక్కా ఇళ్లు నిర్మిస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు. ఈనెల 19న తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 26న కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాసమల్ల దీన, కొట్టపాక రవి, రాజమణి, సుమన్, ఐలయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలిగించొద్దు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్, బస్టాండ్ జంక్షన్‌లో ఆటోలను ఇష్టారీతిన నిలిపి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. ఈమేరకు వరంగల్ రైల్వే స్టేషన్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు నిత్యం వస్తుంటారని, ఈ క్రమంలో ఆటోలను అడ్డదిడ్డంగా నిలపడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే ఆటోలను నిలపాలని సూచించారు. ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



కరీమాబాద్‌లో బీరన్న గుడిని పరిశీలిస్తున్న డీసీపీ



మధ్యకోటలోని పీరీల చావడీని పరిశీలిస్తూ..

ఖిలా వరంగల్: ఈనెల 17న జరగనున్న మొహర్రం, బీరన్న బోనాల పండుగలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమ సూచించారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని బీరన్న గుడి, మధ్యకోటలో పీరీల చావడీలను వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి శనివారం సందర్శించారు. మధ్యకోటలో పీరీల ఊరేగింపు, కరీమాబాద్‌లో బీరన్న బోనాలు ఊరేగింపుగా వెళ్లే రోడ్లను పరిశీలించారు. ఊరేగింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏసీపీ, డీసీపీలకు వివరించారు. బందోబస్తుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కోటేశ్వర్, నీల యాకయ్య, రాజేశం, ప్రమీల, కోరె ఐలయ్య, మిర్యాల కుమారస్వామి, గౌడ కోటేశ్వర్, చీర రాజు, మరుపల్లి గౌతమ్, పూజారి బలభద్ర భాస్కర్, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పార్టీని పటిష్టం చేయాలి



హసన్‌పర్తి: పార్టీని పటిష్టం చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని రెండవ డివిజన్ బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు గడిపె జీవన్, ఎస్‌కే.ఆసిఫ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి శనివారం ఆహ్వానించారు. పార్టీ హనుమకొండ మండల అధ్యక్షుడు అజయ్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తిరుపతి, యూత్ అధ్యక్షుడు దయాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటలు కోటలు దాటాయి



హన్మకొండ: కాంగ్రెస్ మాటలు కోటలు దాటాయి కాని, చేతలు మాత్రం చెయ్యి కూడా దాటలేదని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ 7వ డివిజన్ అధ్యక్షుడు కల్లూరి కల్యాణ్ ఆధ్వర్యంలో 15మంది చేరినట్లు వివరించారు.

మహిళలకు అండగా సఖి కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

హన్మకొండ / విద్యారణ్యపురి: మహిళలకు అండగా సఖి కేంద్రం నిలుస్తోందని సఖి కేంద్రం లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేసు వర్కర్ హరిత తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి సేవలపై హనుమకొండ వడ్డెపల్లిలోని నారాయణ జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న, సమస్యలో చిక్కుకున్న మహిళలు, బాలికలకు కౌన్సెలింగ్, వైద్య, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం అందిస్తున్నట్లు వివరించారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాల ఎదుర్కొన్న బాధితులకు రక్షణ కల్పించడానికి సఖి సెంటర్ పనిచేస్తోందని చెప్పారు. బాధిత మహిళలు, బాలికలు 181, 0870 2452112 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని వై ఆకారం జంక్షన్‌లోని హిందూ జెండా గద్దె స్థానంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 18 అడుగుల 1 అంగుళం ఎత్తుగల అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమిపూజ జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరు దేవేందర్, స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ ఆధ్వర్యంలో వేద పండితుడు భాస్కరాచారి నేతృత్వంలో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నలకుంట రవికుమార్, సిద్ధం రాము, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, అచ్చ వినోద్‌కుమార్, కమ్మ రామ్మోహన్ నాయుడు, కుడికందుల క్రాంతి, గండ్రాతి నవీన్, అపరాదపు సారంగపాణి, వడ్డెపెల్లి భరత్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ‘ఏ’లో చేర్చాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్తులను బీసీ ‘డీ’ జాబితా నుంచి బీసీ ‘ఏ’లో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేయనున్నట్లు తెలిపారు. మచిలీబజార్‌లోని ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్‌లో వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు.ముదిరాజ్ మహాసభ అర్బన్ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, చొప్పరి సోమయ్య, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సారంగపాణి, సాంబమూర్తి, విక్రమ్, బుచ్చిరాజు, సదానందం, హరికృష్ణ, ప్రకాష్, సమ్మయ్య, సాంబయ్య, వెంకటస్వామి, రవీందర్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



పట్టా అందిస్తున్న రాంకిషన్, జయపాల్ రెడ్డి

హన్మకొండ: ఫార్మసీ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఎ.రాంకిషన్ సూచించారు. హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో 26వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసిస్టులుగా సమాజానికి అత్యుత్తమ సేవలు అందించాలన్నారు. సెయింట్ పీటర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యలో తమ కళాశాల విద్యార్థులు పరిశోధనల్లో అగ్రగామిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రిన్సిపాల్ రాజశ్రీ దుర్కే అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో ఫార్మసీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు రాంకిషన్, కళాశాల చైర్మన్ జయపాల్ రెడ్డి పట్టాలు ప్రదానం చేశారు.

సీపీఎస్ రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

వరంగల్: కాంట్రిబ్యూషన్ పెన్షన్ (సీపీఎస్)ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను 15 రోజుల్లో చెల్లించాలని మార్కెట్ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగపురి సారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిందని గుర్తుచేశారు. మూడు డీఏలను తక్షణమే చెల్లించాలని, హెల్త్ కార్డులతో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, మొదటి తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్ష, 30వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న మౌన దీక్షను జయప్రదం చేయాలని ఆయన కోరారు. వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల మార్కెట్ కమిటీల పరిధిలోని పెన్షనర్లు పాల్గొనాలని సారయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి జారతి సత్యనాథ్, కోశాధికారి అంబటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేట – వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య హంటర్‌రోడ్డు పోతన జంక్షన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై శనివారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని శివనగర్‌కు చెందిన తాటికొండ సునీల్‌కుమార్(52) అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు.

జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు

ఖిలా వరంగల్: రాతికోట పశ్చిమ ముఖద్వారం ధ్వంసం చేసిన జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్ శివరాత్రి రాహుల్ ఈనెల 5న మధ్యకోటకు వెళ్తున్న క్రమంలో వాహనాన్ని తప్పించబోయిన జేసీబీ అదుపు తప్పి రాతికోట పశ్చిమ ద్వారాన్ని ఢీకొట్టింది. దాంతో రాతి స్తంభం ముక్కలైంది. కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ కాశిరెడ్డి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శనివారం తెలిపారు.

కార్మిక చట్టం కోసం పోరాటం

న్యూశాయంపేట: వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టం కోసం పోరాటం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం శనివారం జరిగింది. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లింగారెడ్డి, ఎల్లేశ్, లక్ష్మణ్ బి.భిక్షపతి, రాజమణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వరంగల్ చౌరస్తా: ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను గిర్మాజీపేట రజక సంఘం నాయకులు శనివారం కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దేవేందర్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, సారంగపాణి, సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కొమ్మాలలో..



హన్మకొండ అర్బన్: సమావేశంలో పాల్గొన్న అతిథులు



హనుమకొండలోని ప్రతాపరుద్ర కాలనీలో..

నయీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఈక్రమంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సూచించారు. కొమ్మాల లక్ష్మీనరసింహ స్వామిని కుడా చైర్మన్ శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

హన్మకొండ అర్బన్: నూతన సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను పూజించడం, వన మహోత్సవంలో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని రిటైర్డ్ డీఎఫ్‌ఓ కె.పురుషోత్తం సూచించారు. హనుమకొండలోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పుల్లూరి సుధాకర్, అనితారెడ్డి, టి.శ్రావణ్ కుమార్, రవిబాబు, రాజ్‌కుమార్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి కోరారు. వన మహోత్సవంలో భాగంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రతాపరుద్ర కాలనీలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అనంత్, కోశాధికారి రమేష్, బాధ్యులు రాపర్తి లక్ష్మయ్య, శేఖర్‌గౌడ్, సురేందర్, సునీల్‌రెడ్డి, సత్యం, అలీ, డాక్టర్ సాంబమూర్తి, రాజమౌళి, సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



వరంగల్: మొక్కలు నాటుతున్న విద్యార్థులు

శ్రీచైతన్య పాఠశాలలో ‘గ్రీన్ ఇండియా మిషన్’

వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని శ్రీచైతన్య విద్యాసంస్థల ఫౌండర్, చైర్మన్ బీఎస్‌రావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటి, ర్యాలీ చేపట్టారు. అనంతరం వారికి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థల ఆవిర్భావం, లక్ష్యాలు, విజయాలను బీఎస్.రావు జీవిత విశేషాలను వివరించారు. డీన్ యుగంధర్ మాట్లాడుతూ గ్రీన్ ఇండియా మిషన్ లక్ష్యాలు, మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, డీన్ యుగంధర్, ఇన్‌చార్జ్ జనార్దన్, అవినాష్, ఖాదిర్, సుమన్, అంజయ్య, రాజు, లక్ష్మీప్రసన్న, శివాని, తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

స్నేహనగర్‌లోని ఎస్సార్‌లో..

హసన్‌పర్తి: ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటాలని స్నేహనగర్‌లోని ఎస్సార్ పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ రమాశరణ్ సూచించారు. పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి మొక్కలను సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నయీంనగర్: హనుమకొండ లష్కర్ సింగారానికి చెందిన త్రిచక్ర పాదువు సొసైటీ సభ్యుడు ఎండీ.సాజిద్‌ఖాన్ (48) గుండెపోటుతో మృతి చెందారు. కాగా, దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేలను సొసైటీ బాధ్యులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా త్రిచక్ర సొసైటీ అధ్యక్షుడు ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ సొసైటీ గౌరవ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సహకారంతో రూ.లక్ష బీమాను కూడా త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంద శ్రీధర్‌రెడ్డి, జిలుకర స్వామి, గుండా రమేష్, యాసిన్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.